క్లుప్తంగా

సీతారాములకు హనుమంత సేవ



హనుమంత వాహనంపై ఊరేగుతున్న సీతారామలక్ష్మణులు

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): మండలంలోని బ్రాహ్మణపల్లిలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సీతారామ లక్ష్మణులకు విశేష పుష్పాలంకరణ గావించి హనుమంత వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. మాజీ సర్పంచ్ కన్నపురెడ్డి అమర్‌నాథ్‌రెడ్డితో పాటు 45 కుటుంబాలు ఉభయకర్తలుగా వ్యవహరించి స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

నాడు-నేడు పనులపై సమీక్ష

చేజర్ల(సోమశిల): నాడు-నేడు పనులపై అనంతసాగరం ఎంపీడీఓ ఏ మధుసూదనరావు సోమవారం సమీక్షను నిర్వహించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎం.బాలకృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా భావనాఋషి జయంతి



సంగం: సంగం సంగమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పద్మశాలి కులస్తుల ఆరాధ్య దైవ్యం భావనాఋషి జయంతిని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవదేవేరులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పద్మశాలి వర్గీయులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


లోకోస్ యాప్‌పై అవగాహన



యాప్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సంగం: మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం విజయలక్ష్మి జిల్లా ట్రైనర్ హరి లోకోస్ యాప్‌పై సంఘబంధం అధ్యక్షులు, వీఓఏలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. యాప్ ఎలా వినియోగించాలనే దానిపై వారికి అవగాహన కల్పించారు. ఏపీఎం విజయలక్ష్మి మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. మొదటి రోజు యాప్‌లో మెంబర్ ప్రొఫైల్ ఎలా నమోదు చేయాలనే దానిపై అవగాహన కల్పించారు.

పోషకాహార కిట్లు పంపిణీ



పోషకాహార కిట్లు అందిస్తున్న వైద్యురాలు

ఉదయగిరి: మండలంలోని క్షయ వ్యాధిగ్రస్తులకు సోమవారం మండల వైద్యాధికారిణి శివ కల్యానారెడ్డి అదనపు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడతే వ్యాధి నయమవుతుందన్నారు. 2025 నాటికి క్షయను పూర్తి నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు కె.వెంకటసుబ్బయ్య, క్షయవ్యాధి నివారణ పర్యవేక్షకుడు భోగ్యం వెంకటేశ్వర్లు, మలేరియా సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానం



శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

ఆత్మకూరురూరల్: మండలంలోని నువ్వూరుపాడుకు చెందిన శ్రీధర్‌రెడ్డి అనారోగ్యం కారణంగా సోమవారం మరణించడంతో ఆయన కుమారుడు ప్రశాంత్ అంగీకారంతో నేత్రదానం చేశారు. జీజీహెచ్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన వైద్యుల బృందం శ్రీధర్‌రెడ్డి కళ్లను సేకరించారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆత్మకూరు: మండలంలోని నువ్వూరుపాడుకు చెందిన మంగళపూడి శ్రీధర్‌రెడ్డి(53) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆత్మకూరు ఎస్సైలు ఎం శివశంకర్‌రావు, సాయిప్రసాద్ తెలిపారు. శ్రీధర్‌రెడ్డికి భార్య, కుమారు డు, కుమార్తె ఉన్నారు. భార్య పదేళ్ల క్రితం మృతి చెందింది. ఈ క్రమంలో శ్రీధర్‌రెడ్డి నిత్యం మద్యానికి అలవాటు పడ్డాడు. ఆదివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. నెల్లూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు.

సీఎం జగన్ వస్తుంటే పచ్చ పైత్యం

- పచ్చమీడియా, టీడీపీ నేతలకు కడుపు మంట ఎందుకు?
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: లక్షలాది మంది రైతులకు మేలు చేకూర్చే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని, ఆ కుటుంబాల్లో ఆనందం నింపేందుకు ఈ నెల 12న కావలికి వస్తున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. అయితే ముఖ్యమంత్రి కావలి వస్తున్న నేపథ్యంలో పచ్చమీడియా, టీడీపీ నాయకులు పచ్చ పైత్యం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. కావలిలోని తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వేలాది మంది రైతులకు చెందిన లక్షలాది ఎకరాలు, వేలాది మంది ప్రజలకు చెందిన ఇంటి ఆస్తులను నాటి చంద్రబాబు ప్రభుత్వం చుక్కల భూములుగా, నిషేధిత స్థలాలుగా చేసి వారిని కోలుకోని మానసిక క్షోభకు గురి చేశారన్నారు. టీడీపీ ప్రజలకు చెడు చేస్తే.. తమ ముఖ్యమంత్రి మేలు చేయడాన్ని ఈ దుష్ట శక్తులు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. వేలాది మంది రైతులు, ప్రజలు ఉసురు తగిలి చంద్రబాబు, టీడీపీ గాలికి కొట్టుకుపోయారనే విషయం ఇప్పటికీ టీడీపీ నాయకులకు జ్ఞానోదయం కలగకపోవడం విచారకరమన్నారు. ఇంకా తప్పుడు ప్రచారాలు చేస్తే రాబోయే ఎన్నికల్లో భూస్థాపితం కాకతప్పదని హెచ్చరించారు.

టీడీపీది కుసంస్కారం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావలికి వస్తుంటే కావలి అభివృద్ధికి ఇంకా ఏఏ పనులు అడగాలనే సూచలు తెలియజేయాల్సింది పోయి, సంస్కార హీనంగా విషప్రచారాలు చేస్తున్న టీడీపీ నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కావలి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీల్లో 10 ఏళ్లుగా మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, రోడ్లు, డ్రైనేజ్ కాలువలు, తాగునీటి పైప్‌లైన్లు నిర్మాణానికి సీఎం జగన్ రూ.80 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ప్రకటన చేస్తారని ఎమ్మెల్యే వెల్లడించారు. రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా కావలి తీరం వైపు ఉన్న గ్రామాల్లో పారిశ్రామికవాడను ఏర్పాటు చేస్తామని రామాయపట్నం పోర్టు శంకుస్థాపన సమయంలో సీఎం జగన్ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. దీంతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. కానీ ఎల్లో మీడియా, టీడీపీ నాయకులు ప్రజల దృష్టికి మరల్చడానికి, సీఎం జగన్ కావలి పర్యటన తక్కువ చేసి చూపడానికి దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మండి పడ్డారు.

టీడీపీది శిలాఫలకాల పాలన

గతంలో ఐదేళ్ల పరిపాలన చేసిన చంద్రబాబు ప్రభుత్వ కాలంలో ఎన్నికలకు రెండు నెలలు ముందు శిలాఫలకాలు వేసి ప్రజలను మభ్యపెట్టి మోసం చేసి ఓట్లు వేయించుకోవాలని టీడీపీ నాయకులు వేసిన నక్కజిత్తుల ఆటలను ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. తమ ప్రభుత్వ హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన పనులను పరుగులు పెట్టిస్తున్నారన్నారు. రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరిగేలా చర్యలు తీసుకున్నారన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు పూర్తి చేశారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, దగదర్తి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, బోగోలు మండల వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షుడు ఎం. వీర రఘు, కావలి జెడ్పీటీసీ సభ్యుడు జంపాని రాఘవులు, అల్లూరు వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షుడు దండా కృష్ణారెడ్డి, నాయకులు నీలం సాయి కుమార్, కనమర్లపూడి వెంకట నారాయణ, పొనుగోటి అనురాధ, కుందుర్తి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



హనుమకొండపాలెంలో ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాక, హనుమకొండపాలెం, చామదల, జలదంకి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద జరిగిన కాలువలు, కుంటలను క్వాలిటీ కంట్రోల్ ఈఈ వేణుగోపాల్ సోమవారం పరిశీలించారు. పనుల నాణ్యత, కొలతలు పరిశీలించారు. ఎంబుక్‌లు, రికార్డులు పరిశీలించి పనులు నాణ్యతగా నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్లు రంగారెడ్డి, చిరంజీవి, ఫీల్డ్ అసిస్టెంట్లు వేణుగోపాల్, జనార్దన్ ఉన్నారు.

మాదకద్రవ్యాలను సమష్టిగా నిర్మూలిద్దాం

అల్లూరు: మాదక ద్రవ్యాలను సమష్టిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోవూరు సెబ్ సీఐ నరహరిరావు తెలిపారు. సోమవారం మండలంలోని గ్రద్దగుంట, బట్రకాగోల్లు, పురిణి గ్రామాల్లో మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత మాదక ద్రవ్యాలను అమ్ముతున్నట్లు తెలిస్తే వెంటనే సెబ్ అధికారుల తెలియజేయాలన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 14500కు సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సెబ్ ఎస్సై శ్రీనివాసులు సిబ్బంది శ్రీనివాస్, వలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు వినతి



వినతిపత్రం అందిస్తున్న ఎంపీటీసీ విజయ

ఉదయగిరి: ఉదయగిరిలో పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, రైతులకు బీమా వర్తింపజేయాలని కోరుతూ సోమవారం పలువురు రైతులు మండలంలోని బండగానిపల్లె సచివాలయం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కాకు విజయ మాట్లాడుతూ ఉదయగిరిలో పసుపు పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారన్నారు. పండించిన పంట విక్రయించుకునే సౌకర్యం లేకపోవడంతో పొలాల్లో ఉంచుకుని ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరితగతిన కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. రైతు సంఘం నాయకుడు కె.వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

ప్రారంభమైన వేసవి శిక్షణ తరగతులు



సరస్వతీదేవికి పూజలు చేస్తున్న దృశ్యం

చేజర్ల(సోమశిల): అనంతసాగరంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ శిబిరాన్ని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అల్లంపాటి సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. మొదట సరస్వతీ దేవికి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల కోసం ఈ శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లైబ్రేరియన్ నారాయణరావు విద్యార్థులకు ఈ శిక్షణా శిబిరం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద చింతగుంట రమణారెడ్డి, జేవీవీ నాయకులు వేము పెంచలయ్య, రామిరెడ్డి, సచివాలయం వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

సంగం: సంగం శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు కర్నాటి రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని చేపట్టారు. రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వేసవిలో తమ విలువైన సమయాన్ని గ్రంథాలయంలో గడిపి సద్వినియోగం చేసుకోవాలని, పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో పలు పుస్తకాలను చదివించారు.

పెను గాలీవాన



చుంచులూరు వద్ద కురుస్తున్న భారీ వర్షం

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): మండలంలోని చుంచులూరు వద్ద 565, 67 జాతీయ రహదారుల కలిసే కూడలి సమీపంలో గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో పెనుగాలీవాన బీభత్సం సృష్టించింది. సమీపంలో ఉన్న రాజుపాళెం, కుంటనీళ్లపాడు, పడమటినాయుడుపల్లి, కదిరినాయుడుపల్లి, అనంతపురం గ్రామాల్లో సుమారు రెండు గంటల పాటు వర్షం కురిసింది. వాహనదారులు సైతం రోడ్డు మార్జిన్లలో తమ వాహనాలు నిలుపుకొని వర్షం తగ్గిన తర్వాత బయలుదేరారు.

847 పొగాకు బేళ్లు కొనుగోళ్లు

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం 847 పొగాకు బేళ్ల రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశామని వేలం నిర్వహణ అధికారి రాజశేఖర్ తెలిపారు. పొంగూరు క్లస్టర్‌కు చెందిన రైతులు 877 బేళ్ల వేలానికి తీసుకురాగా, వివిధ కారణాలు వల్ల 30 బేళ్లు వేలం నుంచి తిరస్కరించామన్నారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.178 నమోదైందన్నారు.

కావలి ప్రతిష్టను పెంచిన రెడ్‌క్రాస్ సేవలు



డ్యూనంట్‌చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

కావలి: కావలి రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు రాష్ట్ర, జాతీయ స్థాయి గుర్తింపు పొంది, అనేక అవార్డులు పొందడం ద్వారా కావలి ప్రతిష్టను పెంచాయని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గుజరాత్ భూకంపం, కేరళ, చెన్నై, కర్నూలు వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల్లో కావలి రెడ్‌క్రాస్ వలంటీర్లు సకాలంలో స్పందించి బాధితులకు సేవలందించారన్నారు. రక్త కేంద్రం రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. రక్త కేంద్రం ఆధునీకీకరణకు తనవంతు ఆర్థిక సహకారం అందించానని, ఇకపై కూడా కావలి రెడ్‌క్రాస్‌కు తన సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. రెడ్‌క్రాస్ ఉద్యమ స్థాపకులు డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్‌కట్ చేశారు.

అలరించిన రెడ్‌క్రాస్ కవాతు

ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వలంటీర్ల ర్యాలీ ప్రజలను ఆకర్షించింది. ఈ ర్యాలీని కావలి ఆర్డీఓ శీనానాయక్ జెండా ఊపి ప్రారంభించారు. రెడ్‌క్రాస్ సభ్యులు బెజవాడ రవికుమార్, రవిప్రకాష్, సుధీర్, ప్రసన్న, శ్రీహరి రెడ్డి, పార్వతి శంకర్, అరుణ, జమున పాల్గొన్నారు.

టెన్త్ టాపర్‌కు ఎమ్మెల్యే అభినందనలు



ఆత్మకూరురూరల్: పదో తరగతి ఫలితాల్లో మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఉప్పునూతల మహిమ 577 మార్కులు సాధించి టాపర్‌గా నిలవడంతో సోమవారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి విద్యార్థినీకి శాలువా కప్పి అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల ఆశలను ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు.

భోజన ప్యాకెట్ల పంపిణీ



కావలి: ప్రతి సోమవారం నిర్వహించే స్పందనకు వచ్చే అర్జీదారులకు ఇకపై భోజనం ఏర్పాటు చేస్తామని ఆర్డీఓ శీనానాయక్ తెలిపారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో భోజన కౌంటర్‌ను ఆర్డీఓ ప్రారంభించారు. రెడ్‌క్రాస్ సంస్థ అర్జీదారులకు భోజనం అందించేందుకు ముందుకు వచ్చిందన్నారు. భోజనం ఏర్పాటు చేసిన డాక్టర్ బెజవాడ రవికుమార్‌ను ఆర్డీఓ అభినందించారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, సిబ్బంది ప్రసాద్, మధురెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా అలకలతోపు



వింజమూరు(ఉదయగిరి): మండలంలోని నల్లగొండ్ల పుణ్యక్షేత్రంలో జరుగుతున్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అలకలతోపు ఉత్సవం వేడుకగా నిర్వహించారు. వేకువజామునే హయగజ ఉత్సవాలను కనుల పండుగగా నిర్వహించారు. శ్రీవారిని అశ్వవాహనంపై, అమ్మవార్లను గజవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అనంతరం శ్రీవారు తూర్పు వైపు మెట్ల నుంచి, అమ్మవార్లు పడమర వైపున్న మెట్లపై నుంచి కొండపై ఉన్న ఆలయానికి చేరుకోవడానికి పరుగు పందెంగా వెళ్లారు. శ్రీవారు, అమ్మవార్లను త్వరగా చేర్చేందుకు భక్తులు పోటీ పడ్డారు. అమ్మవారు ముందుగా కొండపైకి చేరుకున్నారు. దీంతో ఈ ఏడాది ఆహార పంటలు (మాగాణి) బాగా పండుతాయని భక్తులు విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం లక్ష్మీవాదం నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఉభయకర్తలుగా తూర్పువీధి వారు వ్యవహరించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

అనుమసముద్రంపేట: మండలంలోని కావలియడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్త మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు సోమవారం నగదు పురస్కారాలను అందజేశారు. అనంతసాగరం మండలం వెంగంపల్లి సోషల్ ఉపాధ్యాయుడు నాగినేని మస్తాన్ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన నారే దేవకి (550 మార్కులు) రూ.3 వేలు, పట్టెం వెంకట కళ్యాణి (530 మార్కులు) రూ.2 వేలు, దేగా పూజ (515 మార్కులు) రూ.1500, ముప్పూరి విజయలక్ష్మి (499 మార్కులు) రూ.1000 నగదు ప్రోత్సాహకాలతో పాటు ఫైళ్లను అందజేశారు. హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, కో ఆప్షన్ మెంబర్ ఏలూరి మాల్యాద్రి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వాల నిర్లక్ష్యమే శాపం



కదిరినాయుడుపల్లిలో ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు (ఆత్మకూరురూరల్): ఉమ్మడి రాష్ట్రంలో చివరి ప్రభుత్వంగా ఉన్న కాంగ్రెస్ హయాంలో ప్రారంభించిన సోమశిల హైలెవల్ కెనాల్ పనులను ఆ పార్టీ పాలకులు, అనంతరం వచ్చిన టీడీపీ ఐదేళ్ల పాలనలో తీవ్ర నిర్లక్ష్యం వల్లే నిర్వాసితులైన రైతులకు శాపంగా పరిణమించిందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి, కుంటనీళ్లపాడు గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. జోరు వాన కురుస్తున్నా లెక్క చేయకుండా గడప గడపకు వెళ్లి ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను వివరించారు. పలువురు వ్యక్తిగత సమస్యలు, అంతర్గత రహదారులు, సిమెంట్ రోడ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా శాఖల ద్వారా ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. తమ ప్రభుత్వంలో వరసగా రెండేళ్లు కోవిడ్ కారణంగా అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొన్నా.. సోమశిల హైలెవల్ కెనాల్ రెండో దశ పనులు చేపట్టి ముమ్మరంగా సాగిస్తున్నామన్నారు. పడమటినాయుడుపల్లి, చుంచులూరు పంచాయతీల్లో ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను జేసీ, తెలుగు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తదితరుల ద్వారా విచారణ చేయించి న్యాయమైన సమస్యలు అన్నింటికి పరిష్కారం చూపిస్తామన్నారు. వచ్చే ఏడాదిలోగా పడమటినాయుడుపల్లి హైలెవల్ కెనాల్ నిర్వాసితులకు పరిహారం అందించడంతో పాటు పనులను కూడా వేగవంతం చేస్తామన్నారు. ఎల్లో మీడియాలో వస్తున్న కథనాలపై ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ మంచి చేసే వారిపై పనిగట్టుకుని విమర్శలు, ఆరోపణలు చేయడం అలవాటుగా మారిపోయిందన్నారు. వారి ప్రచారం వల్ల క్షేత్రస్థాయిలో జరిగిన వాస్తవాలు ప్రజలకు తెలుసు కాబట్టి పనిచేసే వారికి ఇంకా మంచి గుర్తింపు లభించినట్లుగా తాను భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ జయమ్మ, మాజీ సర్పంచ్ గిన్నే వెంకటేశ్వర్లు, భీమవరం సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, పలువురు సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

శరవేగంగా రెండో విడత భూ సర్వే

- ఆర్డీఓ సాధు కరుణకుమారి



భూసర్వేపై మాట్లాడుతున్న ఆర్డీఓ కరుణకుమారి

ఆత్మకూరు: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎంపిక చేసిన మండలాల్లోని గ్రామాల్లో మొదటి విడత భూ సర్వే పూర్తయిందని, రెండో విడత భూ సర్వే శరవేగంగా కొనసాగుతోందని ఆత్మకూరు ఆర్డీఓ సాధు కరుణకుమారి అన్నారు. భూసర్వేపై తన కార్యాలయంలో సోమవారం డీఐ ఎ నరసింహమూర్తి, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గతంలో తొమ్మిది గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు. నువ్వూరుపాడు, హసనాపురం, కూనలమ్మపాడు, జంగాలకండ్రిక, సింగారెడ్డిపల్లి, పంద్రంగం, గొల్లపల్లి, బెడుసుపల్లి, కామిరెడ్డిపాడు గ్రామాల్లో పూర్తయిందని, స్టోన్ ప్లాంటేషన్ పూర్తిస్థాయిలో జరుగుతుందన్నారు. ఈ క్రమంలో రెండో విడత భూ సర్వే మొదలు పెట్టినట్లు, ఉదయగిరి మండలంలోని గుడినరవ, కుర్రపల్లి, అనంతసాగరం మండలం ఉప్పలపాడు, కలువాయి మండలంలోని ఐదు గ్రామాలు, చేజర్ల మండలంలోని ఐదు గ్రామాల్లో భూ సర్వే జరుగుతున్నట్లు ఆమె వివరించారు. సర్వే పూర్తయిన అనంతరం కొత్త పాసుపుస్తకాలు, జగనన్న భూహక్కు పత్రాలు రైతులకు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే భూ సర్వే జరుగుతున్న కొన్ని గ్రామాల్లో తాను స్వయంగా పర్యవేక్షణ చేసినట్లు ఆమె తెలిపారు. బ్రిటీష్ పరిపాలన అనంతరం తొలిసారిగా భూ సర్వే నిర్వహిస్తున్నట్లు, ఏళ్ల తరబడి పేరుకుని ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆమె తెలిపారు. భూ హక్కు పత్రాలు, పాసుపుస్తకాల్లో చిన్న మైనర్ పొరపాట్లు జరిగి ఉంటే తమ దృష్టికి తెస్తే సరిచేస్తామన్నారు.

స్పందనలో...

సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 8 అర్జీలు అందినట్లు ఆర్డీఓ తెలిపారు. స్పందనలో అందిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయం సిబ్బంది ఉన్నారు.

పారదర్శకంగానే కాలువల పనులు

- అసంబద్ధ ఆరోపణలు సరికాదు
- ఎంపీపీ కే వేణుగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ, నాయకులు

ఆత్మకూరు: మండలంలోని అప్పారావుపాళెంలో 2020-21, 2021-22 వ్యవసాయ సీజన్‌లో కాలువల తవ్వకాల పనులు పారదర్శకంగా జరిగాయని, ఎలాంటి అవకతవకలు జరగలేదని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ ప్రసన్నలక్ష్మి చెప్పారు. అప్పారావుపాళెం, బట్టేపాడు, కొత్తపాళెం గ్రామాల్లో గతంలో జరిగిన కాలువల పనులపై కొందరు చేసిన ఆరోపణలపై ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు విచారణ చేసి ఎలాంటి పొరపాట్లు జరగలేదని నిర్ధారించారన్నారు. కొందరు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై అసత్య ఆరోపణలు చేసిన క్రమంలో సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ 2020-21లో ఓఎస్ఎం ద్వారా టెండర్ వర్క్‌లు వచ్చాయని గూడూరుకు చెందిన ఓ కాంట్రాక్టర్ మూడు గ్రామాల్లో కాలువలు తవ్వకాలు చేశారన్నారు. 2021లో వచ్చిన వరదలకు కాలువలు పూడిపోయాయని, దీంతో 350 ఎకరాల్లో వరిపైరు సాగు కాలేదన్నారు. ఈ విషయాలను అప్పట్లో మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఎఫ్‌డీఆర్ గ్రాంట్ ద్వారా మళ్లీ నిధులు మంజూరు చేయించి కాలువ పనులు చేయాల్సి వచ్చిందన్నారు. దీంతో రైతులు పంటలు పండించుకున్న విషయం అందరికి తెలిసిందేనన్నారు. వాస్తవం ఇది అయితే గ్రామానికి చెందిన చంద్రా శ్రీధర్, చంద్రా మల్లికార్జునలు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఇరిగేషన్ ఎస్ఈ తన సిబ్బందితో రెండు రోజుల క్రితం కాలువలను పరిశీలించారన్నారు. ఎలాంటి అవకతవకలు జరగలేదని గుర్తించారన్నారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రం, సచివాలయం, హెల్త్ క్లినిక్ తదితర భవనాల నిర్మాణాలు పూర్తయ్యి ఎమ్మెల్యే ప్రారంభించిన విషయం అందరికీ తెలుసునని, ఇంకా అభివృద్ధి జరగలేదని అబద్ధాలు ప్రచారం చేయడం వారి వివేకానికే నిదర్శనమని జెడ్పీటీసీ ప్రసన్నలక్ష్మి అన్నారు. బోయలచిరివెళ్ల సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, తోడేటి అశోక్, అంజాన్ బాషా ఉన్నారు.

టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ చేస్తాం

- మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు



కమిషనర్ సత్కరిస్తున్న చైర్‌పర్సన్, నాయకులు

ఆత్మకూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలోని టిడ్కో ఇళ్లు గతంలోనే పంపిణీ చేసి ఉన్నారని, మిగిలిన లబ్ధిదారులకు త్వరలో పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు అన్నారు. సోమవారం టీపీఓ చంద్రశేఖర్, ఆర్ఐ ఖాసీం, ఏఈ జే ప్రసాద్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి సోమవారం స్పందన తప్పనిసరిగా నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. టిడ్కో ఇళ్ల పరిస్థితి గురించి, అక్కడ వసతుల గురించి చేయాల్సిన అదనపు పనులు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు కోరుకున్న మేరకు రూ.50 వేలు, రూ.25 వేలు డిపాజిట్ కట్టే ఇళ్లకు బ్యాంకర్ల రుణం మెప్మా అధికారులు పూర్తి చేసేలా వారిని ఆదేశించారు. మెప్మా, ఐఎంఎం అంకయ్య, బేగ్, మాధవి పాల్గొన్నారు.

కమిషనర్‌కు ఘన సన్మానం

నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావును చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, సీహెచ్ ఆదిశేషయ్య, వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలరు వెంకటేశ్వర్లు, స్వరూపరాణి, గుడి సంధ్య, సీహెచ్ కామాక్షయ్య, చిన్నపరెడ్డి, జమీర్, ముఖీవర్, వినయ్‌కుమార్ రెడ్డి, అబ్దుల్లా, వెంకటరమణ ఉన్నారు.

పేద ప్రజల కోసమే సంక్షేమ పథకాలు

- మెట్టుకూరి ధనుంజయ



గ్రామంలో పర్యటిస్తున్న ధనుంజయరెడ్డి

కొండాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల కోసమే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు మెట్టుకూరి ధనుంజయరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రేణమాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ కన్వీనర్ కర్తం శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో ఇల్లిల్లూ తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలు అందుతున్నాయ లేదా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కోసం చాలా అభివృద్ధి పథకాలను అందిస్తున్నారన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా వారి కోసం పలు పథకాలు అందించారన్నారు. సర్పంచ్, ఉప సర్పంచ్‌లు మహబూబీజాన్, బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీలు మల్లికార్జునరెడ్డి, సర్పంచ్‌లు రాజాశేఖర్, మాల్యాద్రి, పరుచూరి మాల్యాద్రి, నాయకులు మెట్టు కూరి అమరజీవిరెడ్డి, యడ్లపల్లి వెంకటరమణయ్య, మన్నం వెంకటసుబ్బయ్య, చిమ్మిలి రవీంద్ర పాల్గొన్నారు.